సాక్షి అనకాపల్లి
మంగళవారం । 19 । మార్చి । 2024



ఆర్డీకి అభినందనలు

విశాఖ: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వైద్య ఆరోగ్యశాఖ ఆర్డీ రామ గిద్దయ్యను ఉద్యోగుల సంఘం నాయకులు అభినందించారు.



యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్

విశాఖ: రుషికొండ బీచ్‌లో నలుగురు యువకులు స్నానాలకు దిగారు. ఒక యువకుడు కొట్టుకుపోతుండగా లైఫ్‌గార్డ్స్ కాపాడారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
అనకాపల్లి	6.11	4.48
నర్సీపట్నం	6.14	4.46



పరీక్షకు ముందు టి.అర్జాపురం వినాయక ఆలయంలో పూజలు చేస్తున్న విద్యార్థులు



చోడవరం పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల పరీక్ష గదుల వెదుకులాట



అనకాపల్లి, కొప్పాక జెడ్పీ హైస్కూల్‌లో తనిఖీ చేసిన కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, డీఈఓ వెంకటలక్ష్మమ్మ

తొలి రోజు ప్రశాంతం

- పదో తరగతి పరీక్షలకు 99.31 శాతం హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

సాక్షి, అనకాపల్లి: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 108 కేంద్రాల్లో జరిగిన తొలిరోజు పరీక్షకు 21,259 మంది విద్యార్థులకు 21,177 మంది హాజరయ్యారు. 82 మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు తెలుగు పరీక్షకు 99.31 శాతం హాజరు నమోదైనట్లు డీఈవో వెంకటలక్ష్మమ్మ వెల్లడించారు. ఎటువంటి అవాంతరాలు, అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా తొలిరోజు పరీక్షలు జరిగాయి. సోమవారం ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా.. 8.45 గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. విద్యార్థులను గేటు వద్దనే పూర్తి స్థాయిలో తనిఖీ చేసి కేంద్రాల్లోకి పంపించారు. సచివాలయ మహిళా పోలీసులను కేంద్రాల వద్ద విధుల్లో ఉంచారు. బ్యాగులు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్ష కేంద్రాలపై గట్టి నిఘా పెట్టారు. స్క్వాడ్ అధికారులు జిల్లాలో 28 కేంద్రాలను తనిఖీ చేసి, పరీక్షలు జరుగుతున్న తీరును నిశితంగా పరిశీలించారు. అనకాపల్లి మండలం కొప్పాక జెడ్పీ హైస్కూల్, భాష్యం, శ్రీచైతన్య, టౌన్ గర్ల్స్ హైస్కూళ్లను కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సందర్శించారు. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పరీక్షలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈవో వెంకటలక్ష్మమ్మ ఉన్నారు. అనకాపల్లి జేఎంజే ఇంగ్లిషు మీడియం స్కూల్, జీవీఎంసీ టౌన్ గర్ల్స్ హైస్కూల్, కశింకోట మండలంలో గల డీపీఎం జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాలను ఎస్పీ మురళీకృష్ణ తనిఖీ చేశారు. తొలిరోజు ఎటువంటి మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదని డీఈవో తెలిపారు.

ఓపెన్ పరీక్షల్లో ఇద్దరు ఇన్విజిలేటర్ల తొలగింపు

సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పదో తరగతికి ఐదు కేంద్రాల్లో 683 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 615 మంది హాజరయ్యారు. 11 కేంద్రాల్లో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షకు 1643 మందికి గాను 1487 మంది హాజరైనట్లు డీఈవో వెంకటలక్ష్మమ్మ వెల్లడించారు. తొలిరోజు పరీక్షల్లో గాంధీనగరం జీవీఎంసీ హైస్కూల్‌లో ఒక ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తప్పించారని, ముగ్గురిని వివరణ అడిగారని చెప్పారు. జీహెచ్ఎస్ సబ్బవరంలో కూడా ఒక ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తప్పించారు. సిట్టింగ్ స్క్వాడ్ వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు డీఈఓ తెలిపారు.



దేవరాపల్లి నుంచి దూరంగా ఉన్న తెనుగుపూడి పరీక్ష కేంద్రానికి విద్యార్థిని చేరవేస్తున్న కానిస్టేబుల్



దేవరాపల్లిలో స్క్రైబ్ సహకారంతో పరీక్ష రాస్తున్న సిరగం భార్గవనాయుడు

గురుకులం విద్యార్థులకు ప్రత్యేక బస్సులు

నర్సీపట్నం: ఎంజేపీ బీసీ బాలుర గురుకుల విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సురక్షితంగా వెళ్లేందుకు ఎంజేపీ బీసీ గురుకుల విద్యాలయ సంస్థ రాష్ట్ర సెక్రటరీ ఎ.కృష్ణమోహన్ ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారని గురుకుల విద్యాలయాల జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎన్.వెంకటరెడ్డి తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని 8 గురుకుల పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

సకాలంలో ఎన్నికల రిపోర్టులు



ఎన్నికల విభాగం అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

- ఉన్నతాధికారులు ఉదాసీనంగా ఉండొద్దు
- జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల విభాగాలన్నీ సమర్థవంతంగా పని చేస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ కార్యాలయానికి సకాలంలో రిపోర్టులు పంపాలని జిల్లా ఎన్నిక అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన ఎస్పీ కె.వి.మురళీకృష్ణ వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంసీసీ, ఎంసీఎంసీ, స్టాటిక్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్, వీడియో వీవింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు క్షుణ్ణమైన అవగాహన, గట్టి నిఘాతో పని చేయాలన్నారు. పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్, ఆదాయపు పన్నుశాఖ, సమాచార శాఖలు సమన్వయంతో నిబంధనల ప్రకారం సమర్థవంతమైన చర్యలు చేపట్టాలన్నారు. ఉన్నతాధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉదాసీనంగా ఉండొద్దన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావీయకుండా పూర్తి దృష్టి పెట్టి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం, మాదక ద్రవ్యాలపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు.

జిల్లాలో గట్టి బందోబస్తు : ఎస్పీ

జిల్లాలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. సభలు, సమావేశాలకు సందర్భాన్ని బట్టి అనుమతులు, బలగాల నియామకం చేస్తామన్నారు. ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ తగిన విధంగా వ్యూహరచన ఉంటుందని చెప్పారు. వర్గాల మధ్య గొడవలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, డీఆర్వో బి.దయానిధి, జీఎస్‌వీఎస్ అధికారి మంజులవాణి, కోఆపరేటివ్ అధికారి గోవిందరాజులు, డీసీవో కిరణ్ కుమారి, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, ఆర్టీవో ప్రకాష్‌రావు, సీపీవో రామారావు, డీఎస్‌వో కె.వి.ఎల్.మూర్తి, జీఎస్టీ అధికారి అపర్ణ, ఎక్సైజ్ అధికారి సునీత, పౌర సరఫరాల డీఎం పి.జయంతి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఉమ్మడి విశాఖ వైఎస్సార్ సీపీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్‌గా నాగిరెడ్డి



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి విశాఖ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్‌గా తిప్పల నాగిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ పనిచేస్తారు.

మొదటిసారిగా జిల్లాలో ఇంటర్ మూల్యాంకనం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం ఆదినారాయణ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మూల్యాంకనం ప్రారంభమైంది. ఇక్కడ కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పరిశీలించారు. మూల్యాంకనం సమయంలో ఇతర వ్యక్తులను కళాశాల ఆవరణలోకి పంపించొద్దని, పోలీస్ బందోబస్తు పర్యవేక్షణలో నిత్యం ఉండాలని ఇంటర్మీడియట్ ఒకేషనల్ విద్యా శాఖ జిల్లా అధికారి బి.సుజాతకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త జిల్లాలో ఏప్రిల్ 3వ తేదీ వరకూ 500 మంది అధ్యాపకులతో ఇంటర్ మూల్యాంకనం నిర్వహిస్తామన్నారు. ఈ సమయంలో అధ్యాపకులను తనిఖీ చేసి లోనికి అనుమతిస్తున్నట్లు చెప్పారు.

ఉపమాక కల్యాణానికి కట్టుదిట్టమైన భద్రత



బందోబస్తు ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ

నక్కపల్లి: ఉపమాకలో ఈనెల 20 నుంచి జరగనున్న స్వామివారి కల్యాణోత్సవాల బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సోమవారం పరిశీలించారు. బుధవారం ఉదయం నుంచి గురువారం మధ్యాహ్నం వరకు ఆలయానికి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని దేవస్థాన సిబ్బంది తెలిపారు. కోట్లాది రూపాయల విలువైన ఆభరణాలను స్వామివారికి అలంకరించనున్న నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు అవసరముంటుందని వారు వివరించారు. దీనిపై ఎస్పీ తమ సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఉదయం నుంచి ఆలయానికి వచ్చే నాలుగు వైపులా రహదారులపై స్టాపర్లు ఏర్పాటు చేయాలన్నారు. సాయంత్రం నుంచి కార్లు, ద్విచక్ర వాహనాలను పూర్తిగా నిలిపివేసి కేవలం నడిచి వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేయాలని, వాహనాల పార్కింగ్‌ను నక్కపల్లి సమీపంలోనే ఏర్పాటు చేయాలన్నారు. పుష్కరిణి వద్ద గజ ఈతగాళ్లను నియమించాలన్నారు. వివిధ స్టేషన్ల నుంచి 150 మందికి పైగా ఎస్ఐలు, సీఐలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లను బందోబస్తు కోసం వినియోగిస్తున్నామన్నారు. ఎస్పీ వెంట ఎస్‌బి డీఎస్పీ అప్పారావు, నర్సీపట్నం డీఎస్పీ జి.ఆర్.మోహన్, సిఐలు విజయ్‌కుమార్, అప్పన్న ఉన్నారు.

ఉపమాకలో నేడే అంకురార్పణ





ప్రదక్షిణలు చేసే భక్తుల కోసం వేసిన టెంట్లు (ఇన్‌సెట్) శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరుడు

- పెండ్లి కావిడి ఊరేగింపుతో అందరికీ ఆహ్వానం
- కల్యాణోత్సవాలకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు

నక్కపల్లి: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణానికి మంగళవారం అంకురార్పణ జరగనుంది. ఉదయం 9.45 గంటలకు స్వామివారి పెండ్లి కావిడిని ఉపమాక మాడ వీధుల్లో ఊరేగిస్తారు. స్వామివారి కల్యాణోత్సవాలకు అందరూ ఆహ్వానితులేనంటూ పెండ్లికావిడిని ఊరేగించడంతో భక్తులు స్వామివారికి పసుపు కుంకుమలు, కొబ్బరికాయలు కానుకగా సమర్పిస్తారు. సాయంత్రం అంకురార్పణతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. 20వ తేదీ బుధవారం రాత్రి గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసిందని ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు.

వేసవి తాపాన్ని తట్టుకునేలా ఏర్పాట్లు

వేసవి కాలం సమీపించడం, ఎండ వేడిమి ప్రారంభం కావడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దర్శనానికి వచ్చే భక్తుల కోసం క్యూకాంప్లెక్స్‌లు, బారికేడ్ల నిర్మాణం, షామియానాలు, జర్మన్ టెంట్లు వేసే కార్యక్రమం పూర్తయింది. ప్రధాన రాజగోపురం బయట భక్తుల కోసం విశాలమైన పెద్ద షెడ్డు వేశారు. పుష్కరిణిని శుభ్రం చేసి నాచు, పూడికతీత పనులు పూర్తిచేశారు. రక్షణ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. మెట్లమార్గంలో రెయిలింగ్ ఏర్పాటు చేశారు. షెడ్లలో భక్తులు సేద తీరేందుకు గ్రీన్ మ్యాట్‌లు వేస్తున్నారు. మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కల్పించారు.

వడ్డాదిలో కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు



స్వామివారి దర్శనం కోసం శుభ్రం చేసిన మెట్ల మార్గం (ఇన్‌సెట్) శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

- నేటి అర్ధరాత్రి అంకురార్పణతో వేడుకలు ప్రారంభం
- 20 నుంచి 24వ తేదీ వరకు ఘనంగా నిర్వహణ

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి 151వ కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి దేవస్థానం అధికారులు, వంశపారంపర్య ధర్మకర్తల మండలి సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. బుధవారం నుంచి ఆదివారం వరకు ఐదు రోజులు స్వామివారి కల్యాణ మహోత్సవాలు జరుగుతాయి. మంగళవారం అర్ధరాత్రి అంకురార్పణ చేసి స్వామి వారి దొంగపెండ్లితో కల్యాణ వేడుకలు ప్రారంభిస్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానుండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వంద మందితో సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ డి.ఈశ్వరరావు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. క్యూలైన్లు, మంచినీటి సదుపాయం, వైద్య సేవలు అందేలా ఆలయ ధర్మకర్త దొండా కన్నబాబు, ఈవో శర్మలు తగిన చర్యలు చేపట్టారు. ఆలయ పరిసర ప్రాంతాలు, మెట్ల మార్గం, కళావేదిక తదితర ప్రాంతాల్లో రంగులు వేసి మిరుమిట్లు గొలిపే భారీ విద్యుత్ లైట్ సెట్టింగ్‌లను ఏర్పాటు చేశారు. కల్యాణ మండపాన్ని అందంగా తీర్చిదిద్దారు. ధ్వజస్తంభం వద్ద, ఆలయంలోను, ఉత్సవ విగ్రహాల వద్ద తొక్కిసలాట లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

ఇవీ కార్యక్రమాలు..

కల్యాణ వేడుకల్లో భాగంగా 20వ తేదీ ఏకాదశి రోజున స్వామివారికి సహస్రనామ, అష్టోత్తర నామాలతో పూజలు, ఉదయం, సాయంత్రం హోమాలు, గజ, గరుడ వాహనాలపై తిరువీధి ఉత్సవం, రాత్రి 9 గంటలకు స్వామివారికి కల్యాణం నిర్వహిస్తారు. 21వ తేదీన ప్రత్యేక పూజలు, సాయంత్రం వేదపఠనం, 22న సదస్యం, 23న శనివారం ప్రత్యేక పూజలు, 24న ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, నాగవల్లి వసంతోత్సవం, స్వామివారి తిరువీధి ఉత్సవం, చక్రస్నానం తదితర కార్యక్రమాలు ఉంటాయి. 25వ తేదీన రాత్రి 9 గంటలకు స్వామి వారికి పుష్పయాగోత్సవం (పవళింపు సేవ)తో కల్యాణ వేడుకలు ముగుస్తాయి.

వెల్ఫేర్ అసిస్టెంట్ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

దేవరాపల్లి: ఎన్నికల విధి నిర్వహణలో విద్యుత్ షాక్ గురై మృతి చెందిన కొత్తపెంట సచివాలయం ఉద్యోగి డెక్క చిరంజీవి కుటుంబానికి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేశారు. విజయనగరం జిల్లా వేపాడ మండలం కుమ్మపల్లిలో నివాసం ఉంటున్న మృతుడి భార్య హేమలతకు రూ.10 లక్షల చెక్కును దేవరాపల్లి డిప్యూటీ తహసీల్దార్ జి.ఆనందరావు సోమవారం అందజేశారు. ఎన్నికల విధుల్లో భాగంగా కొత్తపెంట సచివాలయం పరిధిలోని ములకలాపల్లిలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు తొలగిస్తుండగా ఆదివారం విద్యుత్ షాక్ గురై సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ చిరంజీవి అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన ప్రభుత్వం మృతుడి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించింది. డీటీతోపాటు వీఆర్వోలు రాంబాబు, నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ తదితర్లు పాల్గొన్నారు.



మృతుడి భార్య హేమలతకు రూ.10 లక్షల చెక్కును అందజేస్తున్న డీటీ ఆనందరావు

క్లుప్తంగా

14 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్

నాతవరం: విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 14 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని ఎంపీడీవో జాగారపు రాంబాబు సోమవారం తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ పార్టీల కటౌట్లు, బ్యానర్లు తొలగించేందుకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గైర్హాజరైన నాతవరం సచివాలయం -1 పరిధిలో ఐదుగురు, నాతవరం -2 పరిధిలో ముగ్గురు, వై.డి.పేట సచివాలయం పరిధిలో ఇద్దరు, పెదగొలుగొండపేట సచివాలయం పరిధిలో ముగ్గురు, డి.యర్రవరం సచివాలయం పరిధిలో ఒకరికి చొప్పున నోటీసులు జారీ చేశామన్నారు. ఎన్నికల సమయంలో అన్ని శాఖల అధికారులు బాధ్యతగా పని చేయాలన్నారు.

రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు


విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం

పాయకరావుపేట: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఆదివారం నుంచి ప్రారంభమైనది. ఇందులో భాగంగా రాజకీయ నాయకుల విగ్రహాలకు అధికారులు ముసుగులు వేస్తున్నారు. వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను, ప్రభుత్వ కార్యాలయాల్లో, గోడలపై ఉన్న పాలకుల చిత్రపటాలను, గోడ పత్రికలను తొలగిస్తున్నారు. ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ సిబ్బంది ఈ పనుల్లో బిజీగా ఉన్నారు.

'మాడుగుల టికెట్ గవిరెడ్డికే ఇవ్వాలి'


చీడికాడలో నినాదాలు చేస్తున్న టీడీపీ శ్రేణులు

చీడికాడ: మాడుగుల టీడీపీ టిక్కెట్‌ను మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుకు కేటాయించేలా పార్టీ అధిష్టానం పునరాలోచించాలని పార్టీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి బొబ్బాది తాతారావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రామానాయుడుకు మద్దతుగా పార్టీ శ్రేణులు చీడికాడలో ర్యాలీ నిర్వహించి, నినాదాలు చేశారు. గవిరెడ్డి కాకుండా వేరెవరు ఎన్నికల్లో ఉన్నా టీడీపీకి మరోసారి ఓటమి తప్పదని హెచ్చరించారు.

ఎన్నికల నియమావళి తప్పక పాటించండి

- రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రింటర్లు, బ్యాంకర్లకు కలెక్టర్ ఆదేశం


రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల నియమావళిని తూచా తప్పక పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ప్రదర్శనలు, ప్రచార పత్రికలు, హోర్డింగుల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరన్నారు. ప్రార్థనా స్థలాలు, ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, కార్యాలయాల్లో సభలు, సమావేశాలు ఏర్పాటు చేయకూడదని పేర్కొన్నారు. వీటి అనుమతుల కోసం సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్తగా ప్రభుత్వ పనులకు ప్రారంభోత్సవాలు చేయొద్దని, ప్రస్తుతం పురోగతిలో ఉన్న వాటిని కొనసాగించవచ్చన్నారు. సామాజికవర్గ, మతపరమైన కార్యక్రమాలు నిర్వహించవద్దన్నారు. ఓటర్లను ప్రభావితం చేసేలా ఉపన్యాసాలు, ప్రకటనలు చేయొద్దన్నారు. పార్టీల వారీగా, అభ్యర్థుల పరంగా ప్రచార ఖర్చులను నిబంధనలను అనుసరించి లెక్కిస్తామన్నారు. ఖర్చులకు సంబంధించిన రేట్ చార్టును కలెక్టర్ కార్యాలయంలో పొందవచ్చన్నారు. ప్రైవేట్ స్థలం, ఇళ్లు, గోడలపై ప్రచార పోస్టర్లు, హోర్డింగులు ఏర్పాటు చేసుకున్నట్లయితే వాటి యజమాని నుంచి అనుమతి పత్రం సమర్పించాలన్నారు. సమావేశంలో డీఆర్వో బి.దయానిధి, డీసీఏవో గోవిందరాజులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, గొర్లె సూరిబాబు, కె.వి.సత్యనారాయణ, బొలిశెట్టి శ్రీనివాసరావు, కొల్లి రావు, శేషగిరి పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులు, ప్రింటర్లకు సూచనలు

జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులు, ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు ఎన్నికల నియమావళి ప్రకారం నడుచుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రింటర్లు తాము ప్రింట్ చేసిన కరపత్రాలు, పోస్టర్లలో ప్రింట్ చేయించిన వారి పేరు, ప్రింటర్ పేరు, కాపీల సంఖ్య తప్పనిసరిగా ప్రింట్ చేయాలన్నారు. రెండు కాపీలను సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి, కలెక్టర్ కార్యాలయానికి పంపించాలన్నారు. సందేహాలుంటే కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారుల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులోనికి వచ్చినప్పటి నుంచి ఎక్కువ మొత్తంలో జరిగిన బ్యాంకు లావాదేవీలను జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. పోటీ చేసే అభ్యర్థికి తప్పనిసరిగా ప్రత్యేక బ్యాంకు అకౌంటు తెరవాలన్నారు. అధిక మొత్తంలో అనగా రూ.కోటి అంతకు మించి జరిగిన లావాదేవీలు, అనుమానాస్పద నగదు డ్రా వివరాలను తెలపాలని పేర్కొన్నారు. రూ.10 లక్షలు అంతకు మించి అభ్యర్థి, వారి జీవిత భాగస్వామి పేరున డ్రా చేసినా ఆ వివరాలను తమకు నివేదించాలన్నారు. సమావేశంలో డిఆర్వో బి.దయానిధి, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, వివిధ బ్యాంకు అధికారులు, జిల్లాలోని ప్రింటర్లు పాల్గొన్నారు.

ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వీరే

- అనకాపల్లి పార్లమెంటు ఆర్వోగా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

జిల్లాలో నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్లు వీరే..		
నియోజకవర్గం	రిటర్నింగ్ ఆఫీసర్లు	ఫోన్ నెంబర్
చోడవరం	ఆర్డీవో చిన్నికృష్ణ	8978281888
మాడుగుల	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏపీఐఐసీ జీవీ సత్యవాణి	9100384699
అనకాపల్లి	జేసీ ఎం. జాహ్నవి	7702896799
యలమంచిలి	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్ఏబీటీ) కె.మనోరమ	9959333477
పాయకరావుపేట	సింహాచలం ఎస్‌వీఎల్ఎన్ డిప్యూటీ కలెక్టర్ జయరాం	9100064954
నర్సీపట్నం	ఆర్డీవో జయరాం	9100064954

సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి పార్లమెంటు స్థానానికి రిటర్నింగ్ అధికారిగా జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి వ్యవహరిస్తారు. పార్లమెంట్ ఆర్వో పరిధిలో ఆరుగురు ఏఆర్వోలు (నియోజకవర్గ ఆర్వో) ఉంటారు. వీరి పర్యవేక్షణలో 22 మంది ఏఆర్వోలు పనిచేస్తారు. ఎన్నికల నోటిఫికేషన్‌ వెలువడినప్పటి నుంచి ఫలితాలు ప్రకటించే వరకూ రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు బాధ్యత ఎక్కువగా ఉంటుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, అభ్యర్థుల ఖర్చు, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ, ఉపసంహరణ, పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ, బ్యాలెట్ పేపర్ల తయారీ, కౌంటింగ్ వంటి కీలకమైన బాధ్యతలు రిటర్నింగ్ అధికారుల సమక్షంలోనే నిర్వహిస్తారు.

గోవాడ సుగర్స్‌లో గన్ మెటల్ చోరీ


గొడౌన్‌ను పరిశీలిస్తున్న పోలీసులు, ఫ్యాక్టరీ అధికారులు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మెటీరియల్ స్టోర్‌లో సుమారు రూ.3 లక్షలు విలువైన మెటీరియల్ చోరీ అయినట్లు ఫ్యాక్టరీ యాజమాన్యం గుర్తించి చోడవరం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. వివరాలు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ స్టోర్‌లో గన్ మెటల్ సుమారు 400 కిలోలు దాచి ఉంచారు. ఈ ఏడాది క్రషింగ్ సీజన్ ఇటీవలే ముగియడంతో ఈ గన్ మెటల్‌తో పనిలేకపోవడంతో స్టోర్‌లో భద్రపరిచారు. శని, ఆదివారాలు సెలవు రావడంతో సిబ్బంది తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. సోమవారం ఉదయం స్టోర్ ఇన్‌చార్జి వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి స్టోర్‌లో ఉన్న గన్ మెటల్ చోరీ అయినట్లు గుర్తించారు. వెంటనే ఫ్యాక్టరీ ఎండీకి సమాచారం ఇవ్వడంతో ఆయన పరిశీలన అనంతరం చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి 50 మంది జనసేన కార్యకర్తలు


వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన కార్యకర్తలతో ఎమ్మెల్యే ధర్మశ్రీ, చొక్కాకుల

- పార్టీలోకి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: మండలంలో పలు గ్రామాలకు చెందిన జనసేన పార్టీ కార్యకర్తలు సుమారు 50 మంది వారి కుటుంబాలతో సహా వైఎస్సార్‌సీపీలో సోమవారం చేరారు. వారిని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు చొక్కాకుల వెంకట్రావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. చోడవరం మండలం జన్నవరం, నర్సయ్యపేట, చోడవరం, గాంధీగ్రామాలకు చెందిన జనసేన పార్టీ యువ నాయకులు జొన్నాడ ప్రసన్నకుమార్, రెడ్డి మనోహర్, సాలాపు అనిల్, కందల సాయి, నంబారు రోహిత్, వియ్యల అనిల్ కుమార్, కోసం భార్గవబాబు, వరహాలు, కృష్ణ ఆధ్వర్యంలో సుమారు 50 మంది తమ కుటుంబాలతో సహా వైఎస్సార్‌సీపీలో చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న కృషికి తామంతా మద్దతు తెలుపుతూ వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసే వారందరికీ ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి అంతా సమష్టిగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, ఉపసర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, మండల యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, సర్పంచ్‌లు గాడి అప్పారావు, ఉగ్గిన నాగబాబు, కోసం సన్యాశిరావు, సాలాపు శ్రీను, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య పాల్గొన్నారు.

చేసిన మేలు మరవలేక వైఎస్సార్‌సీపీలో చేరా

- టీడీపీ క్రియాశీలక నాయకుడు అగ్రహారపు నాగ సత్యనారాయణ


సత్యనారాయణకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ‘ఐదేళ్ల పాలనలో నా కుటుంబానికి రూ.10 లక్షల మేలు కలిగింది.. చేసిన మేలు మరిచి పోతే పుట్టగతులు ఉండవు. అందుకే వైఎస్సార్‌సీపీలో చేరాను’ అని నర్సీపట్నం మండలం మెట్టపాలెం గ్రామానికి చెందిన టీడీపీ క్రియాశీలక నాయకుడు అగ్రహారపు నాగ సత్యనారాయణ అన్నారు. ఈయన మరో తొమ్మిది కుటుంబాలతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరాడు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వీరికి ఎమ్మెల్యే గణేష్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే గణేష్ అంటే తమ కుటుంబానికి ఇష్టమని, అందుకే మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని పార్టీలో చేరానని సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.తాతబాబు, ఎంఎల్‌వో సుర్ల చంద్రశేఖర్, పార్టీ మండలాధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గొంప కన్నయ్యనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ శానాపతి వెంకటరత్నం, నాయకులు తాతాజీ, హరిప్రసాద్ పాల్గొన్నారు.

24న జిల్లా స్థాయి చెస్ పోటీలు

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెంలో జిల్లా స్థాయి చదరంగం పోటీలను ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ప్రగతి చెస్ అకాడమీ నిర్వాహకులు సోమవారం మీడియాకు తెలిపారు. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ప్రవేశ రుసుము రూ.200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అయితే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎలాంటి ప్రవేశ రుసుము లేదన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 22లోగా తమ పేర్లను [illegible] తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. స్థానిక తులసీ కల్యాణ మండపంలో నిర్వహించనున్న పోటీల వివరాల కోసం 9676514520 సంప్రదించవచ్చన్నారు.

14 రోజుల చిన్నారికి అరుదైన చికిత్స

గాజువాక సన్‌రైజ్ ఆస్పత్రి వైద్యుల ఘనత



గాజువాక : అరుదైన వ్యాధితో పుట్టిన చిన్నారికి సన్‌రైజ్ పిల్లల ఆస్పత్రి వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించి పునర్జన్మను ప్రసాదించారు. జన్మించిన 14 రోజులకే సాహసోపేతంగా శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యులు 35 రోజులపాటు శ్రమించి పసికందును బతికించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యం బృందంతో పాటు ఆస్పత్రి ఎండీ డాక్టర్ టి.తిరుపతి వివరాలు వెల్లడించారు. అమూల్య జనవరి 2న విశాఖ స్టీల్ జనరల్ ఆస్పత్రిలో ఒక ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆ పసికందు ట్రాకియో ఇసోఫేజియల్ ఫిస్టులా, ఇసోఫేజియల్ ఎట్రిసియం వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో గాజువాకలోని సన్‌రైజ్ ఆస్పత్రిలో చేర్పించారు. వెంటనే శస్త్రచికిత్స చేయకపోతే బతికే అవకాశం ఉండదని వైద్య బృందం తెలిపింది. ఇంత క్లిష్టమైన సమస్యగల శిశువుకు జన్మించిన 14వ రోజున వైద్య బృందం శస్త్రచికిత్స చేశారు. అనంతరం 35 రోజులపాటు వెంటిలేటర్‌పై ఉంచి వైద్యం అందించారు. 31 రోజులపాటు సీపీఏపీ మెషీన్‌ద్వారా బిడ్డకు ఆక్సిజన్ అందించారు. ఈ ప్రాసెస్‌లో బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం కూడా సవాలుగా మారిందని, వైద్య బృందం నిరంతర కృషివల్ల ఈ సమస్యను అధిగమిస్తూ వైద్యం అందించినట్లు ఆస్పత్రి ఎండీ తిరుపతి వెల్లడించారు.

సెప్టిక్ ట్యాంక్‌లో జారిపడి వ్యక్తి మృతి

అనకాపల్లి: ప్రమాదవశాత్తూ సెప్టిక్ ట్యాంకులో జారి పడిన ఘటనలో మండలంలోని మూలపేటకు చెందిన తోట శేషు(43) సోమవారం అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ సీఐ శంకరరావు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన బొడ్డు సంఘమేష్ ఇంటి నిర్మాణంలో శేషు పనిచేస్తున్నాడు. పని సమయంలో కాలుజారి సెప్టిక్ ట్యాంకులో పడిపోయి, అక్కడికక్కడే మరణించాడు. మృతుని భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు జాబ్ మేళా

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం గౌరీ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు డబ్ల్యూఎన్ఎస్, డెక్కన్ ఫిన్ కెమికల్స్ కంపెనీల్లో 225 పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వివాహిత మృతిపై చురుగ్గా దర్యాప్తు

- ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం



పొన్నవోలు సమీపంలో భవానీ మృతదేహం, (ఇన్‌సెట్) మృతురాలు గంటమాల భవానీ(ఫైల్)

మాడుగుల రూరల్:అనుమానాస్పదంగా మృతి చెందిన వివాహిత కేసులో దర్యాప్తు ముమ్మరం చేసినట్లు స్థానిక ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. మృతురాలి తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ దామోదర్‌తోపాటు, ఎ.కోడూరు సీఐ స్వామినాయుడు సోమవారం ఉదయం సంఘటనా స్థలికి చేరుకుని గ్రామస్తుల్ని, కుటుంబ సభ్యుల్ని విచారించారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. డాగ్ స్క్వాడ్ ఊరు దాటి వెళ్లకపోవడంతో గ్రామానికి చెందిన వారే హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉండటంతో పూర్తి వివరాలను వెల్లడించట్లేదు. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు వివరాలివి.

మండలంలోని ఎల్.పొన్నవోలు గ్రామానికి చెందిన గంటమాల భవానీ(26) మృతి కేసులో ముగ్గురు వ్యక్తుల్ని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారిలో అదే గ్రామానికి చెందిన ఇద్దరితోపాటు, దిబ్బూరు గ్రామానికి చెందిన వ్యక్తి ఒకరు ఉన్నట్లు సమాచారం. వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎ.కోడూరు సీఐ స్వామినాయుడి పర్యవేక్షణలో విచారణ జరుపుతున్నట్లు బోగట్టా. అయితే వీరి నుంచి ఎటువంటి సమాచారం లేదని తెలిసింది. భవానీ మృతదేహానికి సోమవారం సాయంత్రం అనకాపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. భవానీది హత్యా? ఆత్మహత్యా? అన్నది మిస్టరీగా మారింది. అయితే మృతురాలి మెడపై గొంతు నులిమిన ఆనవాళ్లుండటంతో హత్యగానే అనుమానిస్తున్నారు. భవానీకి పదేళ్ల క్రితం దేవరాపల్లి మండలం ముషిడిపల్లికి చెందిన రెడ్డి ప్రకాష్‌తో ప్రేమ వివాహం జరిగింది. ఈ పెళ్లిని ప్రకాష్ తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో వీరు పొన్నవోలులోని అత్తవారింట నివాసం ఉంటున్నారు. ప్రకాష్ కారు డ్రైవర్‌గా, ఇతర సమయాల్లో చిన్న చిన్న పనులు చేస్తుంటాడు. భవానీ అదే గ్రామంలో కిరణాషాపు నిర్వహిస్తోంది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం బహిర్భూమికి వెళ్లిన భవానీ ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఆమె తల్లి వరలక్ష్మి అన్ని చోట్లా గాలించింది. చివరికి సమీపంలోని సరుగుడు తోటలో శవమై కనిపించింది. అ సమయంలో భవానీ భర్త ప్రకాష్ ఊర్లో లేడు. ఫోన్ ద్వారా సమాచారం అందించి, గ్రామ పెద్దల సాయంతో తల్లి వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


మృతుడు గోవిందరావు

అనకాపల్లి: మండలంలోని రేబాక గ్రామానికి చెందిన ఎస్.గోవిందరావు(52)ను సోమవారం స్థానిక జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. జీవీఎంసీ విలీన గ్రామం కేఎన్ఆర్ పేట ఆర్టీసీ బస్టాప్‌కు సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడు గాజువాక నుంచి అనకాపల్లి మీదుగా రేబాక వెళ్తుండగా, అదే రహదారిలో వస్తున్న లారీ ఢీకొంది. ప్రమాద స్థలిలోనే గోవిందరావు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామీణ ఎస్ఐ తేజేశ్వరరావు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏలేరు కాలువలో పడి బాలుడి మృతి


మృతి చెందిన బాలుడు (ఫైల్)

మాకవరపాలెం: ఏలేరు కాలువలో పడి దివ్యాంగ బాలుడు తరుణ్‌కుమార్(8) మృతి చెందాడు. సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారం గ్రామానికి చెందిన అట్టా పెంటారావు, రోహిణికి కొడుకు, కూతురు ఉన్నారు. కొడుకు తరుణ్‌కుమార్(8) మానసిక దివ్యాంగుడు. దీంతో సుమారు 8 నెలల క్రితం తామరంలోని ఇమ్మాన్యుయేలు దివ్యాంగ పాఠశాలలో చేర్చారు. అప్పటి నుంచి తరుణ్‌కుమార్ హాస్టల్లో ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం నుంచి తరుణ్ కనిపించకపోవడంతో, సోమవారం తల్లిదండ్రులతో కలసి పాఠశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే మధ్యాహ్నానికి బాలుడి మృతదేహం కశింకోట మండలం అచ్చర్ల వద్ద ఏలేరు కాలువలో లభ్యమైంది. దాన్ని చూసి తల్లిదండ్రులతోపాటు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసుల స్పెషల్ డ్రైవ్.. సారా తయారీపై చర్యలు


దాడుల్లో గుర్తించిన 2000 లీటర్ల బెల్లం పులుపు


పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసిన వాహనాలతో సీఐ, సిబ్బంది

- 30 లీటర్ల సారా స్వాధీనం, 2 వేల లీటర్ల పులుపు ధ్వంసం
- పత్రాల్లేని 15 బైక్‌లు, 3 ఆటోలు, ఒక బొలేరో సీజ్

రోలుగుంట: చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణలో భాగంగా కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు తన సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌ల బలగాలతో సోమవారం బీబీ పట్నం గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తొలుత చట్టవ్యతిరేక కార్యకలాపాల వల్ల నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చట్ట విరుద్ధ జీవనోపాధులను వీడాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీటిని ప్రోత్సహించే వారిపైనా కేసులు, శిక్షలు తప్పవన్నారు. అనంతరం బృందాలుగా విడిపోయి గంజాయి పాత నేరస్తులపై గాలింపు, సారా అమ్మకాలపై దాడులు చేశారు. గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న శనివాడ నాగేశ్వరరావు(39)ను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు మీడియాకు వెల్లడించారు.

ఇదే గ్రామంలో సారా విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. పొలాల్లో సారీ తయారీకి పులియబెట్టిన 2000 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. గ్రామంలో ఎలాంటి పత్రాల్లేని 15 మోటారు బైకులు, 3 ఆటోలు, ఒక బొలేరో వాహనాన్ని సీజ్ చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐ సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎస్.రాయవరం: గెడ్డపాలెం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. సుమారు 55 సంవత్సరాలు వయసున్న గుర్తు తెలియని వ్యక్తిని అడ్డురోడ్డు నుంచి యలమంచిలి వైపు వెళ్లే వాహనం ఢీకొట్టినట్లు పేర్కొన్నారు. ప్రమాదంలో ఆ వ్యక్తి పై నుంచి వాహనం వెళ్లడంతో నుజ్జునుజ్జయి అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృత దేహాన్ని నక్కపల్లి 30 పడకల ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వారానికి ఐదు రోజులు డిబ్రూఘడ్-కన్యాకుమారి

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల డిమాండ్ మేరకు ప్రస్తుతం వారానికి నాలుగురోజులు నడుస్తున్న డిబ్రూఘడ్-కన్యాకుమారి-డిబ్రూఘడ్ ఎక్స్‌ప్రెస్‌ను ఇకపై ఐదు రోజులు నడిచే విధంగా చర్యలు తీసుకున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. డిబ్రూఘడ్-కన్యాకుమారి (22504) వివేక్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 22వ తేదీ నుంచి ప్రతీ ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో కన్యాకుమారి-డిబ్రూఘడ్(22503) వివేక్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 26వ తేదీ నుంచి ప్రతీ సోమ, మంగళ, బుధ, గురు, శనివారాల్లో బయల్దేరుతుంది.

క్లుప్తంగా

వేంకటేశుని హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న దేవదాయశాఖ ఉద్యోగులు

అనకాపల్లి: స్థానిక దేమునిగుమ్మం శ్రీ వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.1,50,773లు వచ్చినట్లు ఆలయ ఈవో టి.రాజసులోచన, చైర్మన్ సకలా రాజ్యలక్ష్మిలు సోమవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తుల ద్వారా హుండీలో 39 రోజులు జమ అయిన నగదును లెక్కించినట్లు తెలిపారు. ఈ నగదును దేవదాయ ధర్మాదాయశాఖ బ్యాంక్‌ఖాతాలో జమచేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు శ్రీధరాల కోమలి, రాజాన లక్ష్మి, సుంకర వెంకటేశ్వరరావు, ఉమ్మిని పైడిరాజు, పర్యవేక్షణ అధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ, ఆలయ అర్చకులు పులఖండం గిరిబాబు, రాజేష్ పాల్గొన్నారు.

దత్త క్షేత్రంలో నేడు, రేపు ఆధ్యాత్మిక శోభ

అనకాపల్లి: గ్రేటర్ విశాఖ విలీన గ్రామం సిరసపల్లి చింతామణి దత్తక్షేత్రంలో మంగళవారం నుంచి రెండు రోజులపాటు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు క్షేత్ర నిర్వాహకుడు ఆంజనేయరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం కార్యసిద్ధి ఆంజనేయస్వామికి బడబానల స్తోత్రం, హనుమాన్ మంత్రం, నాగవల్లీ దళార్చన, లాంగూలాస్త్ర స్తోత్రం, సింధూర అర్చన, 20న సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తామన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు క్షేత్రంలో సంప్రదించాలని కోరారు.

'యాదవులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి'

తుమ్మపాల: అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సుమారు 35 వేల ఓటు బ్యాంకు కలిగిన యాదవ సామాజిక వర్గానికి సముచిత రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బోడి వెంకటరావు అన్నారు. పట్టణంలో గొల్లవీధి సీతారామ దేవాలయ ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయి యాదవ సంక్షేమ సంఘం సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ సామాజిక భవన నిర్మాణం, స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు తగు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకే తమ సహకారం ఉంటుందన్నారు. సమావేశంలో పట్టణ యాదవ సంఘం అధ్యక్షుడు భరణికాన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు పల్లా సత్యఅప్పారావు, ప్రధాన కార్యదర్శులు బొబ్బిలి గోవింద, గోకివాడ లోవకృష్ణ, గౌరవ అధ్యక్షుడు ఒమ్మి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 7,029 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,770	4,490
మొదటి రకం	3,580	4,270
రెండో రకం	3,430	3,800
మూడో రకం	3,280	3,510

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
గామి	: సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు	: సత్యనారాయణస్క్రీన్-2
షరతులు వర్తిస్తాయి (మూడు ఆటలు)	
లంబసింగి (మ్యాట్నీ)	: షిర్డిసాయి
రజాకర్	: పర్తిసాయి
తంత్ర	: వెంకటేశ్వర
రికార్డుబ్రేక్	: శ్రీసత్య
భీమా	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 66 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-40 యూనిట్లు, ఓ పాజిటివ్-13 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 473 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 387 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

అభివృద్ధి.. సంక్షేమం.. ఆరోగ్యం

- 84వ వార్డులో ఐదేళ్లలో అన్ని రకాల వసతులు
- రూ.15 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు
- వార్డు ప్రజలకు సంక్షేమ లబ్ధి రూ.75 కోట్లు



జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధి 84వ వార్డు అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సుమారు రూ.15 కోట్లతో వార్డులో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. సంక్షేమానికి పెద్ద పీట వేశారు. ఈ ఐదేళ్లలో వార్డులోని 5 సచివాలయాల పరిధి ప్రజలు సంక్షేమ ఫలాల రూపంలో ఏకంగా రూ.75 కోట్ల లబ్ధి పొందారు.

అనకాపల్లి: ఐదేళ్ల కాలంలో జీవీఎంసీ అనకాపల్లి జోన్ ప్రజలు గతంలో ఎన్నడూ ఎరుగని అభివృద్ధి, సంక్షేమం చూశారు. జిల్లాలో అత్యధిక వ్యాపార కార్యకలాపాలు జరిగేది 84వ వార్డులోనే. వివిధ రకాల వ్యాపారస్తులతోపాటు, దుకాణాలు కూడా పెద్దసంఖ్యలో ఇక్కడే ఉన్నాయి. రూ.కోట్ల మేర లావాదేవీలు జరుగుతాయి.

22ఏ తొలగింపుతో భారీ ఉపశమనం

పట్టణ పరిధిలో ఉన్న వార్డులో దుకాణ సముదాయాలతోపాటు వీరి కుటుంబాలకు చెందిన సుమారు వెయ్యి గృహాలున్నాయి. గత ప్రభుత్వాలు ఈ ప్రాంతాన్ని 22ఏగా నమోదు చేశాయి. దీంతో క్రయవిక్రయాలకు వీల్లేక నానా ఇబ్బందులు పడేవారు. రెండేళ్ల క్రితం ఈ సమస్యపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించింది. సానుకూలంగా స్పందించి 22ఏ నుంచి ఆ ప్రాంతాన్ని తొలగించింది. కోట్నివీధి, గొల్లవీధి, కరణాలవీధి, గాంధీబొమ్మ జంక్షన్, బొగ్గారపువారివీధి, నెయ్యిలవీధి, రింగ్‌రోడ్డు, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల ప్రజలు తమ భూములు, ఇళ్ల కొనుగోలు, అమ్మకాలకు వెసులుబాటు కలిగింది. దీంతో వీరి ఆనందం వర్ణనాతీతం.

- రైల్వేస్టేషన్ కూడలి నుంచి రింగ్‌రోడ్డు వరకు, భీమునిగుమ్మం నుంచి కోట్నివీధి మీదుగా గాంధీబొమ్మ జంక్షన్ వరకు రహదారిని విస్తరించారు. దీంతోపాటు ఈ కూడలి నుంచి పెరుగుబజారు జంక్షన్ రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.
- స్థానిక గొల్లవీధిలో శిథిలావస్థలో ఉన్న యూపీహెచ్‌సీ భవనాన్ని తొలగించి రూ.కోటి 50 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించారు. ఏడాది క్రితం రోగులకు ఈ ఆస్పత్రి అందుబాటులోకి వచ్చింది. ఇద్దరు వైద్యులతోపాటు 10 పడకలను ఏర్పాటు చేశారు. అవసరమైన రక్త పరీక్షలు, మందుల్ని ఉచితంగానే అందిస్తున్నారు.
- జీవీఎంసీ విలీనగ్రామం సిరసపల్లిలో రూ.కోటి 50 లక్షలతో నూతనంగా యూపీహెచ్‌సీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో కేఎస్‌ఆర్ పేట, రాజుపాలెం, సిరసపల్లి, వల్లూరుతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అనారోగ్యం వస్తే, పట్టణానికి పరుగులు తీయాల్సిన అగత్యం తప్పింది.



సుంకరమెట్ట నుంచి జలగల మదుం నూతన రహదారి (ఇన్‌సెట్) గొల్లవీధి యూపీహెచ్‌సీ భవనం

వార్డు విశిష్టతలు

పట్టణం పరిధి సగభాగం, మిగిలినది జీవీఎంసీ విలీన ప్రాంతం	
మొత్తం జనాభా	17,343
మొత్తం ఓటర్లు	13,219
వార్డు పరిధిలో సచివాలయాలు	5
వార్డు ప్రజలకు సంక్షేమ లబ్ధి	రూ.75 కోట్లు
వార్డులో అభివృద్ధి వ్యయం	రూ.10 కోట్లు
గాంధీబొమ్మ నుంచి పెరుగు బజార్ రోడ్డు	రూ.5 కోట్లు
యూపీహెచ్‌సీలు	2

కలలో కూడా ఊహించలేదు



ఒక ప్రభుత్వం తన ఐదేళ్ల కాలంలో మా వార్డును ఇంతగా అభివృద్ధి చేస్తుందని కలలో కూడా అనుకోలేదు. అందులోనూ రెండేళ్ల కరోనాలో ఎలా గడిచాయో అందరికీ తెలుసు. జగనన్న ప్రభుత్వంలో మా జీవితంలో చూడనంత అభివృద్ధి సంక్షేమం చూశాం. రోడ్లు, కాలవల నిర్మాణం, నీటి సరఫరా మెరుగు ఇలా మాకు అవసరమైన ప్రతి సౌకర్యాన్నీ కల్పించారు.

– కె.ఉమాదేవి, కోట్నివీధి

వైద్యం చేరువయ్యింది



మా గ్రామంలో యూపీహెచ్‌సీ నిర్మాణంతో వైద్య సేవలు మాకు చేరువయ్యాయి. చాలా ఆనందంగా ఉంది. గతంలో ఏ చిన్న రోగమొచ్చినా అనకాపల్లి లేదా లంకెలపాలెం వెళ్లాల్సి వచ్చేది. యూపీహెచ్‌సీలో వైద్యులు అన్నిరకాల వైద్యసేవలందిస్తున్నారు. వైద్యపరంగా మా ఊరి వాళ్ల ఇబ్బందులు పూర్తిగా తొలగిపోయాయి. అర్హులందరికీ సంక్షేమ పథకాలందించారు.

– పి.సీత, గొల్లవీధి

తొలి రోజు పరీక్షలు ప్రశాంతం



భాష్యం పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలకు ఆర్టీసీ బస్సులో చేరుకున్న విద్యార్థులు

- పట్టణ, మండల పరిధిలో 3015 మంది విద్యార్థులు

అనకాపల్లి: పట్టణంలో 10వ తరగతి పరీక్షలు తొలి రోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ప్రథమ భాష(తెలుగు) పరీక్ష రాసేందుకు విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు పరుగులు తీశారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా ప్రజా రవాణా శాఖ ప్రత్యేక బస్సులు నడిపింది. హాల్‌టిక్కెట్ కలిగిన విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. చాలా వరకు విద్యార్థులు పరీక్ష సమయానికి ముందే ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను అధికారులు ఏర్పాటుచేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. అత్యవసర సేవల కోసం వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచారు.

- పట్టణ, మండల పరిధి 12 పరీక్ష కేంద్రాల్లో 2,771 మంది రెగ్యులర్ విద్యార్థులు, 244 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారు. పట్టణ పరిధిలో ఏఎంఏఎల్, జేఎంజే, కొప్పాక, గవరపాలెం, గాంధీనగరం, వేల్పులవీధి, భాష్యం, నారాయణ, శ్రీచైతన్య, మండలంలోని మామిడిపాలెం, కూండ్రం, తుమ్మపాల హైస్కూళ్లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను వినియోగించారు.
- స్థానిక మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) బస్సును ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. తమ విద్యార్థులు 60 మంది, 8 కేంద్రాల్లో పరీక్షలు రాసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్, పాఠశాల ఇన్‌చార్జి జి.రేష్మపల్లవి, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ మహేంద్రనాథ్ పట్నాయక్, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.
- మండలంలో కొండుపాలెం గ్రామానికి చెందిన 21 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా పరీక్ష కేంద్రం మామిడిపాలేనికి ప్రత్యేక ఆటోలను ఏర్పాటు చేసినట్లు తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బొండా ఉమ, ఎంపీటీసీ కోఆప్షన్ సభ్యుడు బొండా అప్పలరాజులు తెలిపారు. పరీక్షలు జరిగే అన్ని రోజులూ ఈ ఏర్పాటు ఉంటుందన్నారు.
- పట్టణంలో టెన్త్ పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ సోమవారం సందర్శించారు. స్థానిక భాష్యం, నారాయణ, చైతన్య పరీక్ష కేంద్రాలను పరిశీలించి ఆయా కేంద్రాల వద్ద బందోబస్తులో ఉన్న పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్ష పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని ఆదేశించారు.

కశింకోట: మండలంలోని ఆరు కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా సోమవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 1149 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1146 మంది హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరైనట్లు ఎంఈవో కె.చిట్టిబాబు తెలిపారు. తాళ్లపాలెం హైస్కూలు కేంద్రంలో ఇద్దరు, నరసింగబిల్లి హైస్కూల్లో కేంద్రంలో ఒకరు వంతున గైర్హాజరయ్యారన్నారు. తాళ్లపాలెం హైస్కూలులో ఐదుగురు దివ్యాంగ విద్యార్థులు సహాయకు(స్క్రైబ్)ల సాయంతో పరీక్షలు రాసినట్లు తెలిపారు. తాళ్లపాలెం గురుకుల కళాశాలకు ఈసారి పరీక్ష కేంద్రం ఇవ్వలేదు. దీంతో పాఠశాలకు చెందిన 79 మంది బాలికలు సమీపంలోని పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాశారు. వీరిని ఉపాధ్యాయులు దగ్గరుండి మరీ ఆయా పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లారు.



సచివాలయ మహిళా పోలీస్‌తో మాట్లాడుతున్న విజయభాస్కర్



తాళ్లపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల బాలికలు

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



మలసాల భరత్ కుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

అనకాపల్లి: అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ గత ఐదేళ్ల సీఎం జగన్ పాలనలో రాష్ట్రం ఎంతగానో పురోభివృద్ధి సాధించిందని, దానికి ఆకర్షితులైన టీడీపీ నాయకులు తమ పార్టీలోకి చేరుతున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో మండలంలోని మాకవరం గ్రామానికి చెందిన టీడీపీ నేత వసాది రమణతోపాటు 10మంది నాయకులు సోమవారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి భరత్‌కుమార్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని చూసి విపక్షాలు కూడా విమర్శలు చేసేందుకు సాహసించలేకపోతున్నాయన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, జిల్లా యువజన విభాగం నాయకుడు మలసాల కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

మండలాలకు ఏఆర్వోల నియామకం

సాక్షి, అనకాపల్లి: అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మండలానికి ఒక సహాయ రిటర్నింగ్ అధికారి (ఏఆర్వో)ని నియమించారు. తహసీల్దార్లు ఆయా మండలాలకు ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు.

అనకాపల్లి నియోజకవర్గం
అనకాపల్లి-కె.శ్రీనివాసరావు 9381857227
కశింకోట-ఎల్.మధుసూదన్ 8500322722

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కూరగాయల ధరలు స్థిరంగా కొనసాగాయి. టమాటా కిలో రూ.20, ఉల్లిపాయ రూ.25, బంగాళాదుంపలు రూ.30, బెండకాయలు, దొండకాయలు, బరబాటి రూ.40, బీట్రూట్, క్యారెట్ రూ.60, చిక్కుడు రూ.80కు అమ్మకాలు జరిగాయి.

ఘనంగా గంగదేవితల్లి ఉత్సవం

కశింకోట: మండలంలోని రామన్నపాలెంలో గంగదేవితల్లి ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని ప్రజలు అధిక సంఖ్యలో దర్శించి, పూజలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు ఉత్సాహంగా ఉత్సవాల్లో పాల్గొన్నారు.

శివాలయంలో భజనలు



సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామికి పూలమాలలతో అలంకరణ

కశింకోట: స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతక స్వామి(శివాలయం) ఆలయంలో సోమవారం రాత్రి మహిళలు భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ భక్తి పాటలను పాడుతూ భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. శివలింగాన్ని వివిధ రకాల పూల మాలలతో అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

అవగాహనతో క్షయ నియంత్రణ



పట్టణంలో ర్యాలీ చేస్తున్న యూపీహెచ్‌సీ సిబ్బంది

అనకాపల్లి: క్షయవ్యాధి నిర్మూలనపై ప్రతి ఒక్కరూ చైతన్యం కలిగి ఉండాలని గొల్లవీధి యూపీహెచ్‌సీ వైద్యాధికారి జీకే నాగేంద్ర అన్నారు. క్షయవ్యాధి వారోత్సవాల్లో భాగంగా స్థానిక యూపీహెచ్‌సీ నుంచి కోట్నివీధి వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో క్షయవ్యాధి ఎలాంటి వయో, లింగ తారతమ్యం లేకుండా ఏటా కొన్ని లక్షల మందిని ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే మన దేశంలోలో వ్యాధి గ్రస్తులు ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. గాలి తుంపర్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాధి సోకుతుందన్నారు. ప్రభుత్వం క్షయ రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తోందని, ఆరుమాసాలపాటు మందులు వాడితే వ్యాధి నిర్మూలించవచ్చన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ మరో వైద్యాధికారిణి ధాత్రీప్రియ, క్షయవ్యాధి అధికారి అయ్యప్పరెడ్డి, కో ఆర్డినేటర్ ఎల్లాజీ, వైద్యసిబ్బంది ఎం.పెంటయ్య, ఎస్‌టీఎస్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

'యువత ప్రభుత్వ సహకారంతో ఎదగాలి'



విద్యార్థులతో స్వావలంబి భారత్ ప్రతినిధులు

అనకాపల్లి: యువత స్వయం కృషితో పాటు ప్రభుత్వ సహకారాన్ని వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని స్వావలంబి భారత్ అభియాన్ జోనల్ ఇన్‌చార్జి అగ్గాల హనుమంతరావు సూచించారు. స్థానిక హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులతో స్వావలంబి భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. స్వావలంబి భారత్ వలంటీర్ వెలగా జగన్నాథ్ మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశ యువత పారిశ్రామిక రంగంలో ఎదిగేందుకు అద్భుత అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకుని వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా రాణించాలన్నారు. ప్రపంచంలో భారత్ 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు తోడ్పడాలని కోరారు. ఈ సందర్భంగా స్వావలంబి భారత్ విశాఖ కన్వీనర్, యువ పారిశ్రామికవేత్త ముత్యాలనాయుడు విద్యార్థులతో ముచ్చటించారు. ఆయన మొబైల్ ఆక్సిసర్వీస్ సంస్థను ఏ విధంగా స్థాపించి, 20 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారో వివరించారు. బ్యాంకు రుణాల అనుసంధానకర్త పారుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ హామీ అవసరం లేని రుణాల గురించి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కొణతాల జనార్దన్, ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ



ఆత్మరక్షణపై మెలకువలు నేర్పిస్తున్న కిషోర్ కుమార్

సబ్బవరం: మహిళలపై దాడులు, వేధింపులు పెరుగుతున్న నేపథ్యంలో తమని తాము రక్షించుకునేందుకు మార్గాలు అన్వేషించడం చాలా అవసరమని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ సూర్య ప్రకాశరావు తెలిపారు. విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా సోమవారం నిర్వహించిన ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అప్రమత్తమై మెలకువలతో వేగంగా ఎలా స్పందించాలో ప్రత్యేక నిపుణుడు కిషోర్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ నందిని, సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ లా చైర్ పర్సన్ డాక్టర్ విజయ లక్ష్మి, ఫ్యాకల్టీ మెంబర్ భువనేశ్వరి, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కోలాట పోటీల విజేత పరవాడ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అప్పలనాయుడు తదితరులు

సబ్బవరం: మండలంలోని తవ్వావానిపాలెంలో పరదేశిమాంబ జాతరను పురస్కరించుకొని ప్రముఖ పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కోలాటం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పరవాడ సీతారామ కోలాట బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో శ్రీరామపట్నం జై శ్రీరామ్ కోలాటం బృందం కళాకారులు నిలిచారు. మూడో బహుమతిని శ్రీకాకుళం జిల్లా కుర్లాం శ్రీ తిరుమల శ్రీనివాస జట్టు గెలుచుకుంది. నాలుగో బహుమతి అంకుపాలెం శ్రీ అభయాంజనేయ కళాకారుల బృందం దక్కించుకుంది. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ. 15 వేలు, రూ.12 వేలు, రూ.9 వేలు, రూ.6 వేలు, రూ.3 వేల చొప్పున గ్రామ సర్పంచ్, శ్రీనివాస్ సోదరుడు బోకం స్వామినాయుడు, మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వనం దేముడు బాబు, బోకం కాసు బాబు, బండారు చిన్నంనాయుడు, రాము, పి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాలెం చెక్ పోస్టు తనిఖీ



సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు ఎస్పీ విజయ భాస్కర్

సబ్బవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై మర్రిపాలెం టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును జిల్లా అదనపు ఎస్పీ బి. విజయకుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ ధనుంజయ్ తదితరులు ఉన్నారు.

చెడ్డీ గ్యాంగ్‌తో అప్రమత్తంగా ఉండాలి



పోలీసులు విడుదల చేసిన చెడ్డీగ్యాంగ్ ఫొటోలు

సబ్బవరం: మండలంలోని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సీఐ పిన్నింటి రమణ సూచించారు. నలుగురు సభ్యులు ఉన్న చెడ్డీ గ్యాంగ్ పలు ఇళ్లల్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి ఇంట్లో వారిపై దాడి చేసి బంగారు ఆభరణాలు, నగదు చోరీకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ ముఠా విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పరిధిలోని శివారు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఎటువంటి అనుమానం ఉన్నా.. అనుమానిత వ్యక్తుల కదిలికలను గుర్తించిన వెంటనే 100 టోల్ ఫ్రీ నంబర్, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.